



ఒకప్పుడు కాశ్మీర దేశాన్ని పాలించిన కుమారవర్మ మహారాజు చదరంగమంటే చెవి కోసుకొనేవాడు. తను స్వయంగా చదరంగం ఆడటమేకాకుండా తన ఆస్థానంలో దిగ్గజాల వంటి ఆటగాళ్ళను అట్టే పెట్టుకొని పోషించుతూ ఉండేవాడు.

ఒకసారి మగధ దేశపు రాజుగారి ఆస్థానం నుండి ఇద్దరు చదరంగపు ఆటగాళ్ళు కాశ్మీర రాజును కలుసుకొన్నారు.

“మహారాజా! మేము అనేకమంది మహారాజులను, చక్రవర్తులను దర్శనం చేసుకొని వస్తున్నాం. ఆయా రాజ్యాలలోని చదరంగపు ఆటగాళ్ళు మాతో ఆడ ఓడిపోయారు. మీ దగ్గర కూడా నేర్పరులైన

ఆటగాళ్ళు ఉన్నారని విని, ఇలా వచ్చాం. మాతో ఆడి, మమ్మల్ని ఓడించినా సరే, తామే ఓడిపోయినట్టు మాకు జయపత్రిక లిచ్చినా సరే !" అన్నారు వారు.

రాజుగారికి ఆశ్చర్యం, ఆవేదన కలిగాయి.

వెంటనే ప్రధానమంత్రిని పిలిపించాడు. దీనికేదన్నా ఉపాయం ఆలోచించమన్నాడు. అవమానం జరగకూడదనీ, అలాంటిది జరిగితే ఉరిశిక్ష విధిస్తాననీ అన్నాడు, మంత్రిగారికి మతిపోయింది. దిగులుగా ఇంటికొచ్చాడు. భోజనం చెయ్యకుండా కూచుండిపోయాడు. దగ్గరకు వెళ్ళి కారణం అడగటానికి ఎవ్వరికి ధైర్యంలేక పోయింది.

ఆయన కూతురు ఇదంతా గమనించింది. మెల్లగా తండ్రి దగ్గరకు వచ్చింది. విషయమంతా విన్నది. ఓ నిమిషంపాటు ఆలోచించింది. పద్మావతి ముఖం విప్పారడంతో ఆచార్య రాఘవేంద్రుల ప్రాణం తెప్పరిల్లింది.

"మీరేం భయపడకండి. ఒక్కరితో కాదు — ఒకేసారి ఇద్దరితో చదరంగం ఆడతాను. ఈ సంగతి రాజుగారికి చెప్పండి. మీరు భోజనానికి లేవండి" అన్నది పద్మావతి.

ఆ మరునాడు సభా భవనం యావత్తూ జనంతో నిండిపోయింది. మగధదేశపు ఆటగాళ్ళు రెండు గదుల్లో కూచున్నారు. ఒక్కో

ఆటగాడితో ఒక్కొక్క ఎత్తువేస్తూ పద్మావతి ఓకేసారి ఇద్దరితోనూ చదరంగం ఆడింది.

నిమిషాలు గంటలు గడిచాయి. సాయంత్రానికల్లా ఇద్దరు ఆట గాళ్లు తాము ఓడిపోయామంటూ, గదుల్లోంచి వెలికి వచ్చారు. వారి ముఖాన గోటి గాటుకు నెత్తురు చుక్క లేకుండా పోయింది.

వారిద్దరూ తమ బహుమతులనూ, బిరుదులనూ పద్మావతి పాదాల ముందు ఉంచి, శిరస్సులు వొంచుకున్నారు.

రాజుగారి ఆనందానికి మేరలేదు. ఆచార్య రాఘవేంద్రులు కూడా తన కూతురు ప్రతిభకు ఆశ్చర్యపోయారు. తన కూతురు ఇంత గొప్పగా చదరంగం ఎప్పుడు నేర్చుకొన్నదో ఆయనకు తెలియదు. ఆ సంగతే అడిగాడు.

"మరేం లేదు నాన్నా! ఇద్దర్నీ చెరో గదిలో కూచోబెట్టాను గదా! ఒక ఆటగాడి ఎత్తు జ్ఞాపకం ఉంచుకొన్నాను. అదే ఎత్తును రెండవ వాడి దగ్గర వేశాను. రెండవ వాడి ఎత్తును, మొదటి వాడి దగ్గర వేశాను. దానితో ఇద్దరూ చిత్తుగా ఓడిపోయారు" అన్నది పద్మావతి.